సాక్షి
నిజామాబాద్

బుధవారం । 13 । సెప్టెంబర్ । 2023



బీడీ కార్మికులకు జీవన భృతి పెంచాలి

బీడీ కార్మికులకు రూ. 4వేల జీవన భృతి పెంచాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది నగరంలో ర్యాలీ, ధర్నా నిర్వహించారు.

- 8లో ▸



నడిరోడ్డులో అక్క హత్య

పాత కక్షల కారణంగా అక్కను సోదరుడు నడి రోడ్డు పైనే తల్వార్‌తో నరికి హత్య చేశాడు. మాచారెడ్డిలో ఈ ఘటన జరిగింది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.9 /23.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం ఎండ కాస్తుంది. మధ్యాహ్నం మేఘావృతమై మోస్తరు వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

నిరంతరం జాబ్ మేళా

- మంత్రి ప్రశాంత్‌రెడ్డి వెల్లడి



మోర్తాడ్(బాల్కొండ): బాల్కొండ నియోజకవర్గంలోని యువతి, యువకుల కోసం జాబ్ మేళా కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి వెల్లడించారు. మంగళవారం వేల్పూర్ మండలం లక్కోరాలో నిర్వహించిన జాబ్‌మేళాలో మాట్లాడారు. 70 కంపెనీలు నిరుద్యోగుల ప్రతిభను గుర్తించి ఉద్యోగాల కోసం ఎంపిక చేశాయని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ఈ జాబ్‌మేళాను కొనసాగించామని మంత్రి తెలిపారు. జాబ్ మేళాకు 4,300 మంది హాజరు కాగా 1,236 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇందులో 751 మందికి అపాయింట్‌మెంట్ లెటర్లను అందచేశారు. మరో 485 మందికి రెండు రోజుల్లో లేఖలను అందిస్తామని కంపెనీల ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మధుశేఖర్, నాయకులు కోటపాటి నర్సింహానాయుడు పాల్గొన్నారు.

గణేశ్ మండపాలకు తాత్కాలిక విద్యుత్ సరఫరా

నిజామాబాద్‌నాగారం : వినాయక చవితి నేపథ్యంలో ఈ నెల 18 నుంచి జిల్లా వ్యాప్తంగా మండపాలను నెలకొల్పుతున్న దృష్ట్యా నిర్వాహకులు విద్యుత్ సరఫరా కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఎస్‌ఈ రవీందర్ ప్రకటనలో తెలిపారు. తాత్కాలిక విద్యుత్ సరఫరాకు విధి విధానాలను సీఎండీ గోపాల్‌రావు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తే చర్యలు ఉంటాయన్నారు. గణేశ్ మండలాలకు పాలకు దగ్గర ఉన్న ఎల్‌టీ లైన్ నుంచి నేరుగా విద్యుత్ సరఫరా చేస్తే ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లు బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. మండపాల నిర్వాహకులు అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ) ఆఫీస్‌లో దరఖాస్తు చేసుకొని పదిరోజులకు లోడు ఆధారంగా డబ్బులు చెల్లించి విద్యుత్ సరఫరా పొందాలన్నారు.

- 1.0 కిలోవాట్ వరకు రూ. 1,560
- 1.0కిలోవాట్ నుంచి 1.5వరకు రూ. 2,300
- 1.5కిలోవాట్ నుంచి 2.0వరకు రూ. 3,020
- 2.0కిలోవాట్‌పై నుంచి రూ.3,020లతో పాటు ప్రతి కిలోవాట్ రూ.1,560 చెల్లించాలన్నారు.

వృద్ధాప్య పెన్షన్ కోసం దరఖాస్తులు

నిజామాబాద్‌నాగారం : నగరంలో ఆసరా పెన్షన్ పొందుతున్న (వృద్ధాప్య పెన్షన్) లబ్ధిదారు ఎవరైనా చనిపోతే వారి భాగస్వామి (భర్త లేదా భార్య) ఆసరా పెన్షన్ కోసం తక్షణమే దరఖాస్తులు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మంద మకరందు ఒక ప్రకటనలో సూచించారు. ఈ నెల 22లోపు అర్హులుంటే మరణ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ పత్రాలను మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలన్నారు. 08462-221001లో సంప్రదించాలన్నారు.

కాంగ్రెస్‌లో ఆర్మూర్ లొల్లి

ఆర్మూర్ కాంగ్రెస్ టిక్కెట్టు పార్టీలోని సీనియర్ నేతల మధ్య విభేదాలు సృష్టిస్తోంది. ప్రతి పార్లమెంట్ స్థానం పరిధిలో రెండు నుంచి మూడు శాసనసభ స్థానాల్లో బీసీలకు టిక్కెట్లు కేటాయించాలని కాంగ్రెస్ డిక్లరేషన్‌లో ఉంది. ఇటీవల పార్టీలో చేరిన సర్పంచ్‌ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు గోర్తె రాజేందర్ బీసీ కోటా కింద తనకు టిక్కెట్టు వస్తుందనే ధీమాను వ్యక్తం చేస్తున్నారు. బీజేపీ వదిలి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న పొద్దుటూరి వినయ్‌రెడ్డి గత ఎన్నికల్లో బీజేపీ తరుపున పోటీ చేసి చెప్పుకోదగిన స్థాయిలో ఓట్లు సాధించారు. కాంగ్రెస్ టిక్కెట్టు తనదేనని ఆయన అంటున్నారు.

- ఈ టిక్కెట్ కోసం పార్టీలో అంతర్గత పోరు
- బీసీ, నాన్ బీసీ కోటా నేపథ్యంలో సీనియర్ నేతల మధ్య విభేదాలు
- గోర్తె రాజేందర్, పొద్దుటూరి వినయ్ రెడ్డి మధ్య పోటాపోటీ



పొద్దుటూరి వినయ్‌రెడ్డి
గోర్తె రాజేందర్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : రాబోయే శాసనసభ ఎన్నికల్లో టిక్కెట్ల రేసు నేపథ్యంలో జిల్లాలోని ఆర్మూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ టిక్కెట్టు విషయమై నివురుగప్పిన నిప్పులా లొల్లి జరుగుతోంది. ఈ టిక్కెట్టు కేటాయింపు విషయంలో బీసీ, నాన్ బీసీ అంశం పార్టీ సీనియర్ నేతల మధ్య విభేదాలు సృష్టిస్తోంది. దీంతో ఈ స్థానం కోసం అంతర్గత పోరు షురూ అవుతోంది. ఇటీవల పార్టీలో చేరిన సర్పంచ్‌ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు గోర్తె రాజేందర్, బీజేపీని వదిలి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న పొద్దుటూరి వినయ్‌రెడ్డి మధ్య నువ్వా నేనా అనేలా పోరు నడుస్తోంది. గత ఎన్నికల్లో బీజేపీ తరుపున పోటీ చేసిన వినయ్‌రెడ్డి చెప్పుకోదగిన స్థాయిలో ఓట్లు సాధించారు. ఇక్కడి నుంచి కాంగ్రెస్ టిక్కెట్టు తనదేననే ధీమాతో ఆయన ఉన్నారు. మరోవైపు నియోజకవర్గంలో మున్నూరుకాపు ఓట్లు అత్యధికంగా ఉన్నాయి. దీంతో బీసీ కోటా కింద తనకు టిక్కెట్టు వస్తుందనే ధీమాను గోర్తె రాజేందర్ వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల మధ్య పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది.

బీసీ కోటా డిమాండ్..

కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రతి పార్లమెంట్ స్థానం పరిధిలో రెండు నుంచి మూడు శాసనసభ స్థానాల్లో బీసీలకు టిక్కెట్లు కేటాయించాలనే డిక్లరేషన్ ఉంది. రాష్ట్రంలోని ప్రతి పార్లమెంట్ స్థానం నుంచి కచ్చితంగా బీసీలకు టిక్కెట్లు ఇవ్వాల్సిందేనని డిమాండ్లు ఉన్నాయి. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో జగిత్యాల, కోరుట్ల, బోధన్, నిజామాబాద్ రూరల్ బాల్కొండ టిక్కెట్లను ఓసీలకు కేటాయించే విషయం ఖాయం కావడంతో నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ టిక్కెట్లు మాత్రమే మిగిలాయి. నిజామాబాద్ అర్బన్ టిక్కెట్టు రేసులో ఉన్న పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, ధర్మపురి సంజయ్, కేశ వేణు, ఈరవత్రి అనిల్ దరఖాస్తులు చేసుకున్నారు. మైనారిటీ వర్గం నుంచి తాహెర్‌బిన్ హందాన్ గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆర్మూర్ టిక్కెట్టు కచ్చితంగా బీసీలకు కేటాయించాల్సిందేనని వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ పట్టుబడుతున్నారు. గోర్తె రాజేందర్‌కు ఇవ్వాలని పార్టీ నాయకత్వానికి సూచించారు. ఇదిలా ఉండగా మాజీ మంత్రి, పీసీసీ కోశాధికారి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి మాత్రం వినయ్‌రెడ్డికి ఈ టిక్కెట్టు కేటాయించాలని పట్టుబడుతున్నారు. ఈ విషయమై ఈ ఇద్దరు నేతల మధ్య విభేదాలు సైతం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది.

కరువైన నాయకత్వం..

గోర్తె రాజేందర్, వినయ్‌రెడ్డి ఇటీవల పార్టీలో చేరిన నుంచి కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ, ఇప్పటివరకు ఈ నియోజకవర్గంలో పార్టీని ముందుకు నడిపిన నాయకుడు లేరు. నిజామాబాద్ పార్లమెంట్ నుంచి నాలుగు సార్లు ఎంపీగా పోటీ చేసి రెండుసార్లు గెలుపొందిన మధుయాష్కీ సైతం ఈ దిక్కు కూడా చూడలేదు. మధుయాష్కీ హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్ సీటు కోసం దరఖాస్తు చేసుకున్నారు. మధుయాష్కీ ఇక్కడ దృష్టి పెట్టి ఉంటే ప్రస్తుతం ఇంత సమస్య ఉత్పన్నమయ్యేది కాదని పార్టీ నాయకులు, కార్యకర్తలే అంటున్నారు.

అధిష్టానం టేకోవర్ చేసిన నేపథ్యంలో..

రాష్ట్రంలో పార్టీ గెలుపునకు అవకాశాలున్న నేపథ్యంలో సీనియర్ నేతల మధ్య విభేదాలు, గ్రూపు తగాదాలు పొడసూపుతున్నందున ప్రతి వ్యవహారంతో పాటు విడతలవారీ సర్వేలు, టిక్కెట్ల కేటాయింపు నిర్ణయాధికారాన్ని అధిష్టానమే తన ఆధీనంలోకి తీసుకుంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణపై ప్రతి అంశాన్ని పకడ్బందీగా పరిగణనలోకి తీసుకుంటోంది. గెలుపు అవకాశాన్ని నేతల అనైక్యత కారణంగా దూరం చేసుకోవద్దనే లక్ష్యంతో అధిష్టానం పావులు కదుపుతోంది. ఈ నేపథ్యంలో ఆర్మూర్ టిక్కెట్టు విషయంలో హైకమాండ్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది.

సమైక్యతా పేరుతో కేసీఆర్ కొత్త నాటకం



మీడియాతో మాట్లాడుతున్న డీకే అరుణ

- తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి
- కల్వకుంట్ల కుటుంబం మాత్రమే బంగారుమయమైంది
- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షులు డీకే అరుణ విమర్శలు

సుభాష్‌నగర్ : జాతీయ సమైక్యతా దినోత్సవం పేరుతో సీఎం కేసీఆర్ కొత్త నాటకానికి తెర లేపారని, ఎంఐఎంతో స్నేహం కోసమే తెలంగాణ విమోచన దినోత్సవాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం లేదని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షులు డీకే అరుణ విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సెప్టెంబర్ 17న విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. మంగళవారం నగరంలోని ఓ ప్రయివేటు హోటల్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. బుధవారం నుంచి 17 వరకు బీజేపీ ఆధ్వర్యంలో జరిగే తెలంగాణ విమోచన దినోత్సవాలను ప్రజలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 17న ఉదయం 11 గంటల నుంచి 24 గంటల పాటు నిరుద్యోగ సమస్యలపై ఇందిరాపార్క్ వద్ద రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నాయకత్వంలో నిరుద్యోగ దీక్ష చేపడుతున్నామని తెలిపారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని ప్రకటించిన సీఎం కేసీఆర్ కేవలం నోటిఫికేషన్లకే పరిమితమయ్యారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో మరోమారు నిరుద్యోగ యువతను మోసం చేసేందుకే డీఎస్సీ, ఇతర నోటిఫికేషన్లు విడుదల చేస్తున్నారని అన్నారు. తెలంగాణ దినోత్సవం అధికారికంగా నిర్వహించాలని 15న సికింద్రాబాద్ క్లాక్ టవర్ నుంచి ఉస్మానియా యూనివర్సిటీ, బైరాన్‌పల్లి, పరకాల వరకు భారీ బైక్ ర్యాలీ ఉంటుందన్నారు. 16న అన్ని జిల్లా కేంద్రాల్లో బైక్ ర్యాలీలు నిర్వహించాలన్నారు. 17న బీజేపీ తెలంగాణ విమోచన దినోత్సవానికి అన్ని జిల్లాల నుంచి కార్యకర్తలు, తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. సీఎం కుటుంబం మాత్రమే బంగారుమయమైందని, తెలంగాణ ప్రజలకు బంగారు తెలంగాణ లక్ష్యాన్ని రుచి చూపించలేదన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని సభలు, సమావేశాల్లో చెప్పిన మాటలు, అధికారంలోకి వచ్చిన తర్వాత విమోచనంపై ఆయన మాట్లాడిన మాటలను మైక్ ద్వారా విన్పించారు.

జమిలీ ఎన్నికలు కేవలం ఊహాగానాలేనని, దీనిపై ఎలాంటి సమాచారం లేదని, 119 నియోజకవర్గాల్లో బలమైన అభ్యర్థులు బరిలో ఉంటారని, కామారెడ్డిలో కేసీఆర్‌ను ఓడించే ప్రయత్నం జరుగుతుందని విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానమిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి, కర్ణాటక ఎమ్మెల్యే అభయ్ పాటిల్, పార్లమెంట్ ప్రభారీ వెంకటరమణి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, కరీంనగర్, ఆదిలాబాద్ ప్రభారీలు పెద్దోళ్ల గంగారెడ్డి, అల్జాపూర్ శ్రీనివాస్, జిల్లా ఇన్‌చార్జులు కదం బాల్‌రెడ్డి, ఇజం మహేశ్, విస్తారక్‌లు శ్రీధర్‌రెడ్డి, మహేశ్ జీ, కామారెడ్డి జిల్లా అధ్యక్షురాలు అరుణతార, సీనియర్ నాయకులు లోక భూపతిరెడ్డి, గద్దె భూమన్న, ప్రవీణ్‌కుమార్ గౌడ్, ధన్‌పాల్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్‌ను ఆస్పత్రిలో కలిసిన సంజయ్



ఖలీల్‌వాడి : మాజీ పీసీసీ అధ్యక్షులు, మాజీ మంత్రి డి శ్రీనివాస్ (డీఎస్)ను ఆయన తనయుడు మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ హైదరాబాద్‌లోని సిటీ న్యూరో హాస్పిటల్‌లో కలిశారు. డీఎస్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తన తండ్రికి ప్రస్తుతం ఎక్స్‌టర్నల్ ఆక్సిజన్ అందిస్తున్నారని సంజయ్ చెప్పారు. వైద్యులతో తాను మాట్లాడినట్లు తెలిపారు.

కొడుకా ఎక్కడున్నావ్..

- అదృశ్యమైన కుమారుడిపై బెంగతో తండ్రి మృతి
- చితికి నిప్పు పెట్టిన భార్య



రాహుల్‌తో తండ్రి రాంచందర్

ఖలీల్‌వాడి : కొడుకు ఇంటి నుంచి వెళ్లిపోవడంతో మనోవేదనకు గురైన తండ్రి మృతి చెందిన ఘటన నిజామాబాద్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నెల రోజుల క్రితం నగరంలోని కంఠేశ్వర్‌కు చెందిన రాహుల్ ఇంట్లో చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు వెతికినా జాడ దొరకలేదు. రాహుల్ సెల్‌ఫోన్ కూడా పని చేయకపోవడంతో మూడవ టౌన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. గత ఐదు రోజుల క్రితం రాహుల్ తండ్రి రామచందర్ బెంగతో మరణించాడు. భార్యే తలకొరివి పెట్టింది. బంధువులు, సన్నిహితులు కన్నీటి పర్యంతమయ్యారు. రాహుల్ దశదినకర్మకు వస్తాడమోనని కుటుంబ సభ్యులు, బంధువులు ఎదురు చూస్తున్నారు. రాహుల్ సెల్‌ఫోన్ సిగ్నల్ బాసర పరిసరా ప్రాంతంలో చూపడంతో మహారాష్ట్ర వెళ్లిఉండ వచ్చని ఆశాభావంతో ఉన్నారు. ఎక్కడ ఉన్నా తండ్రి దశ దిన కర్మకు హాజరు కావాలని కోరుతున్నారు.

విద్యార్థినులకు ఫుడ్‌పాయిజన్

భీమ్‌గల్ కస్తూర్బాలో ఘటన

- 120 మందికి అస్వస్థత
- అర్ధరాత్రి 84 మంది జీజీహెచ్‌కు తరలింపు
- త్రీమెన్ కమిటీ వేసి విచారణ జరిపిన అధికారులు
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు మంత్రి ఆదేశాలు



జిల్లా జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

ఖలీల్‌వాడి : భీమ్‌గల్ పట్టణంలోని కస్తూర్బా విద్యాలయం విద్యార్థినులకు ఫుడ్ పాయిజన్ కావడం జిల్లాలో తీవ్ర కలకలం రేపింది. సోమవారం రాత్రి భోజనం తర్వాత 11.30 గంటలకు 120 మంది విద్యార్థినులకు వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి రాగా విద్యాలయ సిబ్బంది 108 అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం సీరియస్‌గా ఉన్న 84 మందిని అర్ధరాత్రి ఒంటి గంటకు నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. సిబ్బంది ఎమర్జెన్సీ గదిలో విద్యార్థినులకు ప్రత్యేక వైద్యం అందించారు. ఫుడ్ పాయిజన్ విషయం తెలుసుకున్న విద్యార్థినుల తల్లిదండ్రులు ఆస్పత్రికి తరలి రాగా, కొందరు కన్నీరు పెట్టుకున్నారు. ఎమర్జెన్సీ వార్డులో ఒకే బెడ్‌పై ఇద్దరికి వైద్యం అందిన సిబ్బంది మంగళవారం ఉదయం వార్డులకు షిఫ్ట్ చేశారు.

త్రీమెన్ కమిటీ..

కలెక్టర్ త్రీమెన్ కమిటీ వేయగా తహసీల్దార్ వెంకటరమణ, ఎస్సై హరిబాబు, ఎంపీడీవో రాజేశ్వర్ కమిటీ సభ్యులు ఏంఈవో స్వామి భీంగల్ కస్తూర్బాకు వెళ్లి వంట గది, పరిసరాలను పరిశీలించారు. వంట గది సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఆహార పదార్థాల శాంపిల్స్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్‌కు సూచించారు. ఎలాంటి ప్రమాదం లేదని బాలికలకు ధైర్యం చెప్పారు. ఘటన జరిగిన స్కూల్‌లో ప్రత్యేకంగా వైద్య శిబిరం ఏర్పాటు చేయించామన్నారు.

స్కూల్‌కు సమీపంలోనే డంపింగ్ యార్డ్..

స్కూల్ సమీపంలోనే డంపింగ్‌యార్డ్ ఏర్పాటు చేయడంతో అక్కడి నుంచి వచ్చే పొగతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా గుట్ట నుచ్చే వర్షపు నీరు పాఠశాల ఆవరణలోకి చేరుతుంది. దీంతో పరిసరాలు కలుషితం కావడంతో పాటు వంట సామగ్రి, తాజా కూరగాయలు లేకపోవడంతోనే ఫుడ్ పాయిజన్ జరిగినట్లు స్థానికంగా చర్చనీయాంశమైంది.

మంత్రి ప్రశాంత్‌రెడ్డి సీరియస్..

విద్యార్థినులకు ఫుడ్ పాయిజన్ ఘటనపై మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సీరియస్ అయ్యారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రతిమారాజ్‌తో మాట్లాడి విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు.



ఆస్పత్రిలో విద్యార్థిని వద్ద తల్లి



విద్యార్థి నుంచి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

ఆహార పదార్థాలపై చీమల గుంపు

నిజామాబాద్‌అర్బన్ : భీమ్‌గల్ కేజీబీవీని పరిశీలించిన అధికారులు అక్కడి అపరిశుభ్రతను చూసి నివ్వెరపోయారు, వంటగదిలోని ఆహార పదార్థాలపై చీమల గుంపులు, పక్కన ఆవరణలో 15 రోజులుగా నిల్వ ఉన్న చెత్తాచెదారం కనిపించింది. తాగునీరు పైపులకు ఫంగస్ ఉండడాన్ని గమనించారు.

వంకాయ కూరలోని లోపం వల్లే విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్లు వైద్యులు భావిస్తున్నారు. ఇన్‌చార్జి ప్రత్యేక అధికారి, ఇద్దరు హెడ్ కుక్కులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కాగా జిల్లాలోని కస్తూరిబా గాంధీ విద్యాలయల్లో అపరిశుభ్రత, ఇతర సౌకర్యాలపై ప్రత్యేక అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ చిత్రమిశ్రా సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీఈవో దుర్గప్రసాద్, జీసీడీవో వనిత పాల్గొన్నారు.

విద్యార్థులను కొరికిన ఎలుకలు

మోర్తాడ్, భీమ్‌గల్ : గతంలో ఇదే కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులను ఎలుకలు కొరికి గాయపరిచిన ఘటన వెలుగు చూసింది. అప్పట్లో విద్యార్థులు ఆందోళన నిర్వహించారు.



విచారణ జరుపుతున్న అధికారులు



కస్తూర్బా పరిసరాల్లో గడ్డి తొలగిస్తున్న కార్మికులు



వంటగదిలో ఆరబోసిన కూరగాయలు

లక్ష్యాల మేరకు రుణాలు పంపిణీ చేయాలి

- బ్యాంకర్ల సమావేశంలో అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా

సుభాష్‌నగర్ : ఆయా రంగాలకు రుణాల పంపిణీలో నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు బ్యాంకర్లు కృషి చేయాలని అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా సూచించారు. జిల్లా వ్యవసాయాధారిత ప్రాంతమైనందున పంట రుణాల పంపిణీకి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాస్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ సమావేశం జరిగింది. గత ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి లక్ష్యాలు, సాధించిన ప్రగతిని బ్యాంకుల వారీగా అదనపు కలెక్టర్ సమీక్షించారు. కొన్ని బ్యాంకులు వెనుకంజలో ఉండడంపై కారణాలను ఆరా తీశారు. పక్షం రోజులకోసారి సమీక్ష నిర్వహించుకుంటూ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని చిత్రామిశ్రా సూచించారు. ముఖ్యంగా రుణమాఫీ పొందిన రైతులందరికీ కొత్తగా పంట రుణాలను అందించాలని, ఈనెలాఖరులోగా నూటికి నూరు శాతం పంట రుణాల రెన్యూవల్ జరగాలని గడువు విధించారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని, రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ సమావేశంలోనూ బ్యాంకర్లు అంగీకరించారని గుర్తు చేశారు. ప్రభుత్వం వర్తింపజేసిన రుణమాఫీ రైతుల చేతికి చేరాలని, అప్పుల కింద వాటిని మినహాయించుకోవద్దని బ్యాంకర్లకు సూచించారు. వ్యవసాయ శాఖతోపాటు ఇతర పశు సంవర్ధక, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ తదితర శాఖలతో సమన్వయం చేసుకుని లబ్ధిదారులకు సకాలంలో రుణాలు అందించి స్వయం ఉపాధికి చేయూతనివ్వాలన్నారు. లబ్ధిదారులు యూనిట్లు స్థాపించారా లేదా నిశితంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. స్వయం సహాయక సంఘాలకు పూర్తి స్థాయిలో లింకేజీ రుణాలు పంపిణీ చేయాలని, సబ్సిడీ రుణాల పంపిణీలో జాప్యం చేయవద్దన్నారు. వీధి వ్యాపారులకు విరివిగా ముద్ర రుణాలతో పాటు స్టాండ్ అప్ ఇండియా కింద రుణాలు అందించాలన్నారు. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత యువతకు స్వయం ఉపాధి కోర్సుల్లో అందిస్తున్న శిక్షణను పూర్తి చేసుకున్న వారికి యూనిట్ల స్థాపనకు రుణాలు అందించాలని సమన్వయకర్త శ్రీనివాస్ కోరారు. కాగా ఈ ఏడాది వ్యవసాయ రంగానికి రూ.6,568.30 కోట్ల రుణాలు అందించాలని లక్ష్యం ఉండగా, జూన్ నెలాఖరు నాటికి రూ.2837.42 కోట్లను పంపిణీ చేసి 43.20 శాతం లక్ష్యాన్ని సాధించామని లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ శ్రీనివాస్ రావు తెలిపారు. సమావేశంలో ఆర్‌బీఐ ఏజీఎం అనిల్ కుమార్, డీఆర్డీవో చందర్, మెప్మా పీడీ రాజేందర్, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

చేపల పెంపకంతో ఆర్థికంగా బలోపేతం

- డీఆర్‌డీవో చందర్ నాయక్



అవగాహన కల్పిస్తున్న ఎండీ ఉదయ్

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్) : ఆధునిక పద్ధతిలో చేపల పెంపకం చేపట్టి ఆర్థికంగా బలోపేతం కావాలని డీఆర్‌డీవో చందర్‌నాయక్ సూచించారు. జిల్లాలో మహిళ సంఘాల ఆధ్వర్యంలో చేపల పెంపకం చేపట్టాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. పైలట్ మండలాలుగా డిచ్‌పల్లి, జక్రాన్‌పల్లి, ఆర్మూర్, బాల్కొండ, వేల్పూర్ మండలాలను ఎంపికచేశామన్నారు. మంగళవారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని టీటీడీసీలో నిర్వహించిన జిల్లా మహిళా సమాఖ్య సమావేశంలో డీఆర్‌డీవో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎంపిక చేసిన మండలాలకు చెందిన మహిళా సంఘాల సభ్యులకు టీటీడీసీలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయ్ అక్వా కనెక్ట్ మేనేజింగ్ డైరెక్టర్ ఉదయ్ మహిళా సంఘాల సభ్యులకు తక్కువ ఖర్చుతో ఆధునిక పద్ధతిలో చేపల పెంపకం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించే విధానంపై అవగాహన కల్పించారు. సర్క్యులేటరీ ఆక్వా కల్చర్ సిస్టమ్ విధానం గురించి వివరించారు. ఈ విధానం ద్వారా చేపల పెంపకం కోసం పీఎంఈజీపీ స్కీం ద్వారా 35 శాతం సబ్సిడీ రుణం వస్తుందన్నారు. ఈ విధానం ద్వారా చేపల పెంపకం కామారెడ్డి జిల్లాలో విజయవంతంగా కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో టీఎస్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్, జిల్లా సమాఖ్య అధ్యక్షులు విప్లవకుమారి, కార్యదర్శి వనిత, కోశాధికారి లక్ష్మీ, డీపీఎంలు శ్రీనివాస్, సంధ్యారాణి, సాయిలు, స్త్రీనిధి ఆర్‌ఎం రాందాస్, ఏపీఎం సరోజిని, మండల మహిళ సమాఖ్యల అధ్యక్షురాలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శంకర్‌భవన్‌లో ప్లేట్లతో నిరసన



నిజామాబాద్‌అర్బన్‌: శంకర్‌ భవన్‌ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం సరిగ్గా వండడం లేదంటూ విద్యార్థులు ప్లేట్లతో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ నగర ఉపాధ్యక్షుడు గణేశ్‌ మాట్లాడుతూ.. నగరంలోని శంకర్‌ భవన్‌ హైస్కూల్‌లో కొన్ని రోజులుగా మధ్యాహ్న భోజనం సరిగ్గా వండడం లేదని విద్యార్థులు మొరపెట్టుకున్నా మార్పు లేదన్నారు. అధికారులు స్పందించి విద్యార్థుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్‌ చేశారు. నగర నాయకులు బాబు, రాజు, రాహుల్‌, విద్యార్థులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు జీవన భృతి పెంచాలి



ఖలీల్‌వాడి: బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులందరికీ రూ.4 వేల జీవనభృతి అందించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌ గాంధీ ఆడిటోరియం నుంచి వేలాదిమంది బీడీ కార్మికులతో ధర్నాచౌక్‌ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. బీడీలు చుట్టే కార్మికులకు, బట్టివాలా, చెన్నివాల, సార్టర్‌, ప్యాకర్స్‌, వాచ్‌మన్‌ తదితర నెలసరి వేతన కార్మికులకు నెలకు రూ. 4 వేల జీవనభృతి ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. బీడీ పరిశ్రమలో పనిచేసే కార్మికులకు అతి తక్కువ వేతనాలు ఉండడంతో వారి జీవనం కష్టమవుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరేందర్‌, యూనియన్‌ జిల్లా అధ్యక్షుడు డి.రాజేశ్వర్‌, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ముత్తెన్న, ఎం.సుధాకర్‌, యూనియన్‌ జిల్లా ఉపాధ్యక్షులు బి.మల్లేశ్‌, సత్తెక్క, జిల్లా సహాయకార్యదర్శి డి.కిషన్‌, కోశాధికారి లాలయ్య, నాయకులు సాయారెడ్డి, లింగం, మురళి, రాజేశ్వర్‌, అరవింద్‌, కిరణ్‌ పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి గణేశ్‌, ఏఐపీకేఎమ్మెస్‌ జిల్లా అధ్యక్షుడు సాయాగౌడ్‌, నాయకులు సాయారెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

రైతుల కోసమే 'మట్టికథ' చిత్రం

చిత్ర దర్శకుడు పవన్‌ కడియాల



నిజామాబాద్‌ సిటీ: రైతులకు తమ భూములపై ఉన్న ప్రేమే ఈ మట్టికథ సినిమా అని చిత్ర దర్శకుడు పవన్‌ కడియాల అన్నారు. మంగళవారం నగరంలోని బింగి కల్యాణ మండపంలో మట్టికథ చిత్రం ప్రమోట్‌ కార్యక్రమంలో చిత్ర దర్శకుడు పవన్‌ మాట్లాడుతూ.. 20 ఏళ్ల క్రితం హైదరాబాద్‌లో రియల్‌ ఎస్టేట్‌ భూమ్‌ మొదలైనప్పుడు హైదరాబాద్‌ చుట్టుపక్కల గ్రామాల్లో పరిస్థితులు ఎలా మారాయి.. భూముల విలువ తెలియకుండా వాటిని అమ్ముకున్న రైతులు ఎలా నష్టపోయారో చూపించే ప్రయత్నమే మట్టికథ సినిమా అన్నారు. ఈ సినిమాలో ముగ్గురు స్టూడెంట్లు వారి జీవితాలు, ఈ మట్టితో వారి జీవితాలు ఎలా ముడిపడి ఉన్నాయో తెలుస్తుందన్నారు. సినిమా విడుదలకు ముందే ఇంటర్నేషనల్‌ ఫిలిమ్‌ ఫెస్టివల్‌ నుంచి 9 అవార్డులు రావడ సంతోషంగా ఉందన్నారు. చిత్రంలో హీరోగా నటించిన నిజామాబాద్‌ జిల్లాకు చెందిన అజయ్‌ చేసిన సందడితో వెక్టర్‌ కళాశాల విద్యార్థుల కేకలు హోరెత్తించాయి. కార్యక్రమంలో చిత్ర నిర్మాత అప్పిరెడ్డి, హీరోయిన్‌ మాయ, సహాయ నటులు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న డీసీసీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, బీజేపీ నాయకులు



పరామర్శిస్తున్న టీయూవీయూ నేత లాల్‌సింగ్‌

విద్యార్థులకు పరామర్శల వెల్లువ..

ఖలీల్‌వాడి/ భీమ్‌గల్‌ : ఫుడ్‌పాయిజన్‌తో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పలువురు నాయకులు పరామర్శించారు. బీజేపీ బాల్కొండ నియోజకవర్గ నేత డాక్టర్‌ మల్లికార్జున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, బీజేపీ నేత స్వామియాదవ్‌, మంత్రి సతీమణి నీరజ, ఎంపీపీ మహేశ్‌, కన్నె సురేందర్‌, డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, కాంగ్రెస్‌ బాల్కొండ నియోజకవర్గ నేత సునీల్‌రెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ నేత అనిల్‌, టీయూవీయూ నేత లాల్‌సింగ్‌, ఏఎస్‌బీఐ నేత మహేశ్‌రెడ్డి, ఎస్‌ఎస్‌యూఐ నేత వేణురాజ్‌, సీపీఐఎంల్‌ నేత ప్రభాకర్‌ విద్యార్థినులను పరామర్శించారు. భీమ్‌గల్‌లోని కేజీబీవీని సునీల్‌రెడ్డి పరిశీలించారు.



కేజీబీవీని పరిశీలిస్తున్న సునీల్‌రెడ్డి



పరామర్శిస్తున్న బీజేపీ నేత మల్లిఖార్జున్‌రెడ్డి

ముందుకు సాగని పనులు

- ఫ్లడ్‌ కంట్రోల్‌ రూం నిర్మాణానికి రూ. 50 లక్షల మంజూరు

బాల్కొండ: ఎస్సారెస్పీ ఆనకట్టపై నిర్మిస్తున్న ఫ్లడ్‌ కంట్రోల్‌ రూం పనులు నెలన్నర రోజులుగా ముందుకు సాగడం లేదు. పనులు ఎప్పుడు పూర్తవుతాయో అధికారులకూ అంతుచిక్కని పరిస్థితి. ప్రాజెక్ట్‌ ఆనకట్టపై ఇది వరకే ఒక ఫ్లడ్‌ కంట్రోల్‌రూం ఉంది. కానీ స్కాడా ఏర్పాటుతో ఉన్న గది ఇరుకుగా మారింది. దీంతో అధికారులకు ఇబ్బందులు కలుగకుండ ఉండేందుకు ప్రభుత్వం మరో ఫ్లడ్‌ కంట్రోల్‌ రూం నిర్మాణానికి రూ. 50 లక్షల నిధులను మంజూరు చేసింది. పనులు గత ఏప్రిల్‌లో ప్రారంభించారు. పనులు మున్నాళ్లు ముందుకు.. ఆరునెల్లు వెనకకు అన్నట్లుగా సాగుతున్నాయి. దీంతో ఇప్పటి వరకు స్లాబ్‌ పనులు మాత్రమే పూర్తయ్యాయి. నేరుగా పిల్లర్లపై స్లాబ్‌ నిర్మాణం చేపట్టారు. కానీ ఒక్క ఇటుక పడలేదు. గోడల నిర్మాణం చేపట్టలేదు. నెలన్నర రోజులుగా పనులు చేపట్టకుండానే అలానే వదిలేశారు. దీంతో పనులు ఎప్పుడు పూర్తవుతాయో అధికారులకు అంతు చిక్కడం లేదు. పాలకులు స్పందించి పనులను వేగవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎస్సారెస్పీపై ప్రతి నీటి చుక్కను కంట్రోల్‌ చేసేందుకు నీటి లెక్కలు ఉండేందుకు స్కాడా (సూపర్‌ వైజరీ కంట్రోల్‌ అండ్‌ డాటా ఈక్వీవేషన్స్‌)ను గత జూలై 26న రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించారు. దీంతో ఉన్న ఫ్లడ్‌ కంట్రోల్‌ రూంలో స్కాడాకు సంబంధించిన కంప్యూటర్లు, పెద్ద స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. దీంతో అధికారులకు కూర్చోడానికి స్థలం లేదు. నతనంగా నిర్మిస్తున్న కంట్రోల్‌ రూం పనులు వెంటనే పూర్తి చేస్తే ఇబ్బంది లేకుండా పోతుంది. పనులు పున: ప్రారంభించడంపై ఉన్నత అధికారులు, పాలకులు వెంటనే చర్యలు తీసుకోవాలి.



నిలిచిపోయిన ఫ్లడ్‌ కంట్రోల్‌ రూం పనులు

పనులు చేపట్టాలని ఆదేశించాం

ఫ్లడ్‌ కంట్రోల్‌ రూం పనులను ప్రారంభించి వెంటనే చేపట్టాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించాం. పనులు పూర్తయితే ఫ్లడ్‌ కంట్రోల్‌రూం ఇబ్బందులు తీరుతాయి. పనులు వేగవంతం చేయాలని సూచించాం.

– చక్రపాణి, ఈఈ, ఎస్సారెస్పీ

తొమ్మిదేళ్లలో దేశం గర్వించదగ్గ అభివృద్ధి

వర్ని: తొమ్మిదేళ్లలో తెలంగాణ దేశం గర్వించదగ్గ అభివృద్ధి చెందిందని స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వర్ని మండలం శంకోరా గ్రామంలో రూ. పది లక్షలతో నిర్మించిన జగదాంబ మాత ఆలయ ప్రహరీని ప్రారంభించారు. రూ. 55 లక్షలతో నిర్వహించనున్న జీపీ భవనం, జనరల్‌ ఫంక్షన్‌ హాల్‌, సబ్‌ సెంటర్‌ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం స్పీకర్‌ మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడిన తర్వాత అన్ని రకాల వసతుల కల్పనకు రూ. కోట్ల నిధులు మంజూరు చేసి నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. వైద్యం, విద్య, రోడ్లు, వ్యవసాయం, సాగు, తాగునీటి కల్పనకు రూ. కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలను రాష్ట్రంలో సీఎం కేసీఆర్‌ అమలు చేస్తూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధిని చూసి ఓటు వేయాలని, కల్లబొల్లి మాటలు చెప్పే పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. వర్ని ఎంపీపీ మేక శ్రీలక్ష్మీవీరరాజు, జడ్పీటీసీ హరిదాసు, వర్ని మార్కెట్‌ కమిటీ ఉపాధ్యక్షుడు వెలగపూడి గోపాల్‌, జాకోర సహకార సంఘం అధ్యక్షుడు కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు కల్లాల్‌ గిరి, సర్పంచులు లక్ష్మి, రాజు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న స్పీకర్‌ పోచారం

వ్యవసాయ పరిశోధన కేంద్రంలో కేంద్ర బృందం సభ్యులు



రుద్రూర్‌: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను అధ్యయనం చేయడానికి మండలంలోని అక్బర్‌నగర్‌కు వచ్చిన కేంద్ర అధికారులు మంగళవారం వ్యవసాయ పరిశోధన కేంద్రం, కృషి విజ్ఞాన కేంద్రం, ఆహార శాస్త్ర సాంకేతిక విజ్ఞాన కళాశాలను సందర్శించారు. పంటలను ఆశించే తెగుళ్ల తట్టుకుని అధిక దిగుబడులనిచ్చే వంగడాలను వ్యవసాయ పరిశోధన కేంద్రంలో రూపొందిస్తున్నట్టు వారికి వ్యవసాయ శాస్త్రవేత్తలు వెల్లడించారు. కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా సేద్యంలో రైతులకు అందిస్తున్న సేవల గూర్చి వివరించారు. రాష్ట్రంలోనే ఏకైక ఆహార శాస్త్ర సాంకేతిక విజ్ఞాన కళాశాల ఇక్కడ ఉందని, విద్యార్థులు అభ్యసించే కోర్సులను అధ్యాపకులు వివరించారు. బృందం సభ్యులతో సర్పంచ్‌ గంగామణీప్రసాద్‌, జీపీ కార్యదర్శి దర్శనం గంగారాం, ఉపాధి హామీ ఫీల్డ్‌ అసిస్టెంట్‌ ప్రసాద్‌ ఉన్నారు.

బ్లడ్‌ టెస్టుల పేరిట రూ.40 వేలకు టోకరా

కామారెడ్డి క్రైం: ఆర్మీ జవాన్లకు ఒకేసారి బ్లడ్‌ టెస్టులు చేయాల్సి ఉందని నమ్మించి పట్టణానికి చెందిన ఓ ల్యాబ్‌ టెక్నీషియన్‌కు ఆన్‌లైన్‌ మోసగాళ్లు రూ.40 వేలకు టోకరా వేశారు. జిల్లా కేంద్రంలోని భూపుత్రమ్మ కల్యాణ మండప ప్రాంతంలో ఉన్న ఓ ల్యాబ్‌లో మాన్‌సింగ్‌ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. మరో డాక్టర్‌కు గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌ చేసి 25 మంది ఆర్మీ జవాన్ల బృందానికి ఒకే సారి రక్త పరీక్షలు చేయాల్సి ఉందని అనడంతో సదరు డాక్టర్‌ మాన్‌సింగ్‌ను పిలిపించాడు. ఫోన్‌ పే ద్వారా డబ్బులు చెల్లిస్తామని నమ్మించిన మోసగాళ్లు బ్యాంకు అకౌంట్‌, ఫోన్‌ పే నంబర్లు అడుగుతూ మాటల్లో పెట్టి నమ్మించారు. వారు చెప్పిన విధంగా చేయడంతో మాన్‌సింగ్‌ అకౌంట్‌లో నుంచి రూ.40 వేలు కట్‌ అయ్యాయి. మోసపోయానని గుర్తించి మంగళవారం సాయంత్రం పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో నరేష్‌ తెలిపారు.

యువతి మిస్సింగ్‌

ఖలీల్‌వాడి: నగరంలోని వినాయక్‌నగర్‌లో ఉంటున్న ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్సై సంజీవ్‌ తెలిపారు. నవీపేట్‌ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి నగరంలోని తన మేనబావ ఇంట్లో ఉంటూ పాలిటెక్నిక్‌ విద్యను అభ్యసిస్తోంది. సోమవారం కళాశాలకు వెళ్తున్నట్లు చెప్పి తిరిగి రాలేదు. యువతి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కామారెడ్డిలో బాలుడు..

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని హరిజనవాడకు చెందిన ఓ బాలుడు అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో నరేశ్‌ మంగళవారం తెలిపారు. కాలనీలో నివాసం ఉండే గంగరాజుకు ఇద్దరు కుమారులు. చిన్న కొడుకు అఖిల్‌ 8వ తరగతి చదువుతున్నాడు. సోమవారం కాలకృత్యాలకు బయటకు వెళ్లిన అతడు ఇంటికి తిరిగి రాలేదు. బాలుని తండ్రి గంగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఎస్సారెస్పీలోకి పోటెత్తిన వరద

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి మంగళవారం ఉదయం వరద పోటెత్తింది. 8818 క్యూసెక్కులకు పెరిగి ప్రారంభమైన వరద రాత్రి వరకు గరిష్ఠంగా 45 వేల క్యూసెక్కులకు పెరిగింది. దీంతో ప్రాజెక్ట్‌ నుంచి 10 వరద గేట్లను ఎత్తి గోదావరిలోకి 31,200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద పెరిగే అవకాశం ఉందని ప్రాజెక్ట్‌ అధికారులు పేర్కొంటున్నారు. ప్రాజెక్ట నుంచి కాకతీయ కాలువ ద్వారా 3 వేల క్యూసెక్కులు, ఎస్కేప్‌ గేట్ల ద్వారా 5 వేలు, ఆవిరి రూపంలో 666 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్‌ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగులు కాగా మంగళవారం రాత్రికి అదే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్ట్‌ నిండుకుండలా ఉంది.



వరద గేట్ల ద్వారా కొనసాగుతున్న వరద

వైద్య సేవలను వినియోగించుకోవాలి

కమ్మర్‌పల్లి: పీహెచ్‌సీల్లో ఆరోగ్య మహిళా కార్యక్రమం ద్వారా అందిస్తున్న వైద్య సేవలను మహిళలు వినియోగించుకోవాలని డీఎంహెచ్‌వో సుదర్శనం కోరారు. మండలంలోని చౌట్‌పల్లి పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమగ్ర ఆరోగ్య పథకం ద్వారా స్క్రీనింగ్‌, వైద్య, వ్యాధి నిర్ధారణ, 8 రకాల పరీక్షలు నిర్వహిస్తారన్నారు. డయాగ్నోస్టిక్స్‌, క్యాన్సర్‌ స్క్రీనింగ్‌, సూక్ష్మ పోషక లోపాలు, మూత్రనాళ ఇన్‌ఫెక్షన్‌, కుటుంబ నియంత్రణ, మెనోపాజ్‌, లైంగిక వ్యాధులు, శరీర బరువు, పలు సేవలు ప్రతి మంగళవారం పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్‌, డాక్టర్‌ సుప్రియ, హెచ్‌ఈవో సత్యనారాయణ, పవన్‌, రవి తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న వైద్యాధికారులు

చోరీకి గురైన సెల్‌ఫోన్ల రికవరీ

కామారెడ్డి క్రైం: పోలీసుశాఖలో ఇటీవల కొత్తగా తీసుకొచ్చిన సీఈఐఆర్‌ విధానంతో సెల్‌ఫోన్ల రికవరీ వేగంగా జరుగుతున్నట్లు ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం తెలిపారు. కామారెడ్డి పట్టణ పోలీస్‌ స్టేషన్‌లో మంగళవారం ఒకే రోజు ఎనిమిదికి చోరీకి గురైన సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 325 సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్లు చెప్పారు. సీఈఐఆర్‌ పోర్టల్‌ ద్వారా ఫోన్ల రికవరీ సులభతరమైందని పేర్కొన్నారు. ఎవరైనా తమ మొబైల్‌ను పోగొట్టుకుంటే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

జాతీయస్థాయి ఉషులో కాంస్యం

నిజామాబాద్‌నాగారం: జిల్లాకు చెందిన క్రీడాకారుడు జైన్షుకు జాతీయస్థాయిలో కాంస్య పతకం సాధించారు. మంగళవారం బీహార్‌లోని పాట్నాలో నిర్వహించిన జాతీయస్థాయి ఉషు పోటీలో జూనియర్‌ విభాగంలో కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా ఉషు క్రీడాకారులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.



రైస్‌మిల్‌ యజమాని రిమాండ్‌

నవీపేట: మండలంలోని పాల్ద శివారులో ఉన్న వెంకటలక్ష్మి ఆగ్రో ఇండస్ట్రీ రైస్‌మిల్‌ యజమాని వేణుగోపాల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నిజామాబాద్‌ రూరల్‌ సీఐ సతీశ్‌, నవీపేట ఎస్సై యాదగిరి మంగళవారంతెలిపారు. గత సీజన్లలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించలేదని పేర్కొన్నారు. రూ. కోటీ86లక్షల విలువైన 50వేల క్వింటాళ్ల ధాన్యాన్ని రైస్‌మిల్‌కు అప్పగించగా కేవలం 20వేల క్వింటాళ్ల బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించినట్లు చెప్పారు. డీటీ శ్రీనివాస్‌ ఫిర్యాదు మేరకు వేణుగోపాల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో విద్యార్థులు పడుతున్న గోస బీఆర్‌ఎస్‌ ప్రభుత్వానికి పట్టడం లేదని టీయూ ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు శ్రీశైలం ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం టీయూ రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ ఎం.యాదగిరిని కలిసి వర్సిటీ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ.. టీయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఇప్పటి వరకు టీయూని సందర్శించక పోవడం శోచనీయమన్నారు. ఇన్‌చార్జి వీసీ వెంటనే వర్సిటీని సందర్శించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో నాయకులు విజయ్‌కృష్ణ, సాయిలు, రాజేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

షుగర్‌ ఫ్యాక్టరీ ప్రైవేటుపరం కాకుండా చూడాలి

నిజామాబాద్‌ రూరల్‌: సారంగపూర్‌ నిజాం షుగర్‌ ఫ్యాక్టరీ ప్రైవేటు పరం కాకుండా ప్రభుత్వం చూడాలని ఎన్‌సీఎస్‌ఎఫ్‌ చైర్మన్‌ కొండెల సాయారెడ్డి డిమాండ్‌ చేశారు. కర్మాగారం వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం షుగర్‌ కర్మాగారాన్ని వెంటనే రైతులకు అప్పగించాలని కోరారు. ప్రభుత్వం మొండి వైఖరికి నిరసనగా అక్టోబర్‌ మొదటి వారంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేయనున్నట్లు తెలిపారు. అనతరం కలెక్టర్‌కు కమిటీ సభ్యులు వినతి పత్రం అందజేశారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు బొడ్డు గంగారెడ్డి, మేనేజింగ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ రవీందర్‌బాబు, డైరెక్టర్లు, లకోష్మరెడ్డి, సంతోష్‌, ఆకుల పాపయ్య, నర్సయ్య, రాజన్న, వెంకట్‌రెడ్డి, రాధాకిషన్‌ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఫ్యాక్టరీ పరిరక్షణ కమిటీ సభ్యులు

అధిక యూరియాతో పంటకు చేటు

వర్ని(మోస్రా): రైతులు తమ పంటపొలాల్లో అధిక యూరియా చల్లడం వల్లే వరి పంటలో బ్యాక్టీరియా ఎండాకు తెగులు వస్తోందని రుద్రూర్‌ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త విజయ్‌ కుమార్‌ తెలిపారు. శివారులోని పంట పొలాల్లో రోగ నిర్ధారక క్షేత్ర సందర్శనను స్థానిక వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. తెగులు సాగు నీటి ద్వారా వ్యాప్తి చెందుతుందని, తెగులు ఆశించిన పొలం నుంచి ఇతర పొలాలకు నీరు పెట్టరాదని సూచించారు. సమగ్ర ఎరువుల యాజమాన్యంతో పాటు మందు సస్యరక్షణ చేపట్టాలన్నారు. వారి వెంట వర్ని వ్యవసాయ అధికారి నగేశ్‌రెడ్డి, వ్యవసాయ విస్తీర్ణ అధికారి ప్రశాంత్‌, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు పిట్ల శ్రీరాములు, గ్రామ కో–ఆర్డినేటర్‌ పోశెట్టి, పోతారెడ్డి, భాస్కర్‌ రెడ్డి, రాములు ఉన్నారు.

కాంగ్రెస్‌ విజయానికి కృషి చేయాలి

నందిపేట్‌ (ఆర్మూర్‌): వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ తరఫున దరఖాస్తు చేసుకున్న అందరూ టికెట్టు ఎవరికి వచ్చినా కలిసికట్టుగా పనిచేయాలని కర్ణాటక రాష్ట్రం ఎమ్మెల్యే సిరిగుప్ప ఎమ్మెల్యే బీఎం నాగరాజు కోరారు. నందిపేట మండల కేంద్రంలో కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన ఆర్మూర్‌ నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామస్థాయిలో బూత్‌ ఏజెంట్లను నియమించి, కాంగ్రెస్‌ పార్టీ అమలు చేసే మ్యానిఫెస్టోని ప్రజలకు వివరించాలన్నారు. ఈ నెల 17న తుక్కుగూడలో నిర్వహించే సోనియాగాంధీ బహిరంగ సభకు అధిక సంఖ్యలో తరాలిరావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, ఆర్మూర్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏబీ శ్రీనివాస్‌ (చిన్న), యాల్ల సాయిరెడ్డి, మారా చంద్రమోహన్‌, గోర్తె రాజేందర్‌, పొద్దుటూరు వినయ్‌ కుమార్‌రెడ్డి, తలారి పోషన్న, కోల వెంకటేశ్‌, ఉల్లి అశోక్‌గౌడ్‌, నందిపేట్‌ కాంగ్రెస్‌ ప్రెసిడెంట్‌ ముంద మహిపాల్‌, జిల్లా నాయకులు పెంట ఇంద్రుడు, వైఎస్‌ గంగాధర్‌, దేగాం గంగారెడ్డి, పిప్పర సాయిరెడ్డి, ఆర్మూర్‌ నియోజవర్గ యువజన కాంగ్రెస్‌ ఉపాధ్యక్షుడు బైండ్ల ప్రశాంత్‌, నాయకులు రెడ్డి గారి నిఖిల్‌, మండల మైనార్టీ సెల్‌ అధ్యక్షుడు ఎస్‌కే ఫరీద్‌ యూసఫ్‌, యువజన కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు పీరాజీ నాగరాజ్‌, ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు బర్కి ముఖేశ్‌, డీసీపీ డెలిగేట్‌ దేవదాస్‌, దమ్మాయి శ్రీను, బల్కం దశరథ్‌, సాయన్న కొండూరు సంజీవ్‌, ఎర్రల రవి, మంగళారపు తుక్కన్న, యువజన కాంగ్రెస్‌ నాయకులు పాల్గొన్నారు.



నందిపేటలో మాట్లాడుతున్న బీఎం నాగరాజు

నడిరోడ్డుపై తల్వార్‌తో నరికి అక్క హత్య

మాచారెడ్డి : కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలంలోని గజ్యా నాయక్‌ తండా చౌరస్తాలో నడిరోడ్డుపై అక్కను తోడబుట్టిన తమ్ముడే తల్వార్‌ తో నరికి హత్య చేసిన ఘటన రాత్రి కలకలం సృష్టించింది. కామారెడ్డి రూరల్‌ సీఐ శ్రీనివాస్‌ తెలిపిన వివరాల ప్రకారం ..గజ్యాతండా చౌరస్తాకు చెందిన చాందీబీకి రుక్సానా(45)తో పాటు మరో నలుగురు కుమారులు ఉన్నారు. అందులో రెండోవాడైన షేక్‌ యూసుఫ్‌కు అక్క రుక్సానాకు మధ్య కొన్నిరోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఆస్తి తగాదాల కారణంగా ఇద్దరి మధ్య అభిప్రాయబేధాలున్నాయి. ఇటీవల రుక్సానాకు చెందిన టాటాఏస్‌ వాహనాన్ని ఆమెనే నిప్పంటించి తమ్ముడు యూసుఫ్‌ తగలబెట్టాడని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిని దృష్టిలో పెట్టుకొని ఎలాగైనా అక్కను అడ్డు తొలగించాలని షేక్‌ యూసుఫ్‌ పథకం వేశాడు. రుక్సానా మంగళవారం రాత్రి బస్సు దిగి ఇంటికి వెళ్తుండగా కాపుకాసి తల్వార్‌తో తలపై పలుమార్లు నరికాడు. ఆమె అక్కడికక్కడే కుప్పకూలి ప్రాణాలు వదిలింది. అక్క చనిపోయిందని నిర్ధారించుకున్న తర్వాత యూసుఫ్‌ నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్‌ గౌడ్‌ తెలిపారు.



క్రైం కార్నర్‌

కులాస్‌పూర్‌ తండా సర్పంచ్‌పై దాడి

మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌): మండలంలోని కులాస్‌పూర్‌ తండా సర్పంచ్‌ జరుపుల శ్రావణ్‌కుమార్‌పై అదే తండాకు చెందిన పలువురు దాడికి పాల్పడినట్లు ఎస్సై ఎల్‌ రాము మంగళవారం తెలిపారు. తండాకు చెందిన చందర్‌ పంట పొలాన్ని శ్రావణ్‌కుమార్‌ వర్గీయులు దున్నేయడంతో గొడవ జరిగింది. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పీడీఎస్‌ బియ్యం పట్టివేత

ఖలీల్‌వాడి: నగరంలోని మిర్చికంపౌండ్‌లో పీడీఎస్‌ బియ్యం కొనుగోలు చేస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్ముతున్న సమీర్‌, షేక్‌ అహ్మద్‌ నుంచి 60 సంచుల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

చెరువులో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

కామారెడ్డి క్రైం: కూతురు సంసారంలో గొడవలు జరుగుతున్నాయనే బెంగతో ఓ తల్లీ ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి మున్సిపల్‌ పరిధిలోని లింగాపూర్‌ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన భూమని బాల్‌రాజవ్వ(60)కి కుమారుడు రాజయ్య, కుమార్తె నర్సవ్వ ఉన్నారు. రాజంపేటకు చెందిన వ్యక్తితో నర్సవ్వకు గతంలోనే వివాహం జరిగింది. ఆమె సంసారంలో కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఎప్పటిలాగే ఇంట్లో అందరూ కలిసి నిద్రించారు. కొడుకు రాజయ్య మంగళవారం ఉదయం నిద్ర లేచి చూడగా తల్లి ఇంట్లో కనిపించలేదు. స్థానికుల సమాచారం మేరకు గ్రామ సమీపంలోని చెరువులో బాల్‌రాజవ్వ మృతదేహం ఉన్నట్లు గుర్తించారు. దేవునిపల్లి పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణచేపట్టారు. కొడుకు రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాలువలో యువకుడి గల్లంతు

బాల్కొండ: మండలంలోని కిసానగర్‌ వద్ద ఎస్సారెస్పీ నుంచి ప్రవహించే వరద కాలువలో ముప్కాల్‌ మండలకేంద్రానికి చెందిన షేక్‌రియాజ్‌ గల్లంతైనట్లు ఎస్సై గోపి తెలిపారు. మండల కేంద్రానికి చెందిన రియాజ్‌ అప్పుల బాధతో కొంతకాలంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. బుధవారం ఉదయం గాలింపు చర్యలు చేపడుతామన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో సోమవారం రాత్రి ఇంటి తాళాలు పగుల గొట్టి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ఏఎస్సై గణేశ్‌ మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన కుమ్మరి బాల్‌రాజు సోమవారం డిచ్‌పల్లి మండలం కమలాపూర్‌కు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉన్నది. ఇంట్లో బీరువా తాళాలు సైతం పగుల గొట్టి ఉండడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి పరిశీలించారు. బీరువాలో దాచి ఉంచిన 12 గ్రాముల బంగారం, 12 తులాల వెండి, రెండు తులాల వెండి, రూ.20 వేలు నగదు అపహరణకు గురైనట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.